‘రక్షణ’ లేని ప్రయాణం

ప్రమాదకరంగా వంతెనలు
- ధ్వంసమవుతున్న రక్షణ రేలింగ్‌లు
- భయాందోళనలో ప్రయాణికులు


రాయికోడ్ సమీపంలో ధ్వంసమైన రక్షణ రేలింగ్

రాయికోడ్(అందోల్): మండలంలోని పలుచోట్ల ఉన్న రోడ్లపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా కుసునూర్ సమీపంలోని ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలమై తరుచూ రాకపోకలు నిలిచిపోతున్నాయి. రాయికోడ్ సమీపంలోని వంతెనకు ఇరువైపులా రక్షణగా ఉన్న రేలింగ్ ధ్వంసమై వాహనదారులకు రక్షణ లేకుండా పోయింది. సిరూర్ సమీపంలో మంజీర నదిపై ఉన్న వంతెన రేలింగ్‌ను దశాబ్దం క్రితం లారీ ఢీకొనగా రక్షణగా ఉన్న రేలింగ్ పాక్షికంగా ధ్వంసమై చువ్వలు తేలాయి. ఇప్పటికీ మరమ్మతుకు నోచుకోలేదు. అదేవిధంగా మండలంలోని యూసుఫ్‌పూర్, ఉల్గేర, ధర్మాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లపై పలుచోట్ల లోలెవెల్ వంతెనలు ఉన్నాయి. దీంతో ఏటా వర్షాలు కురిసిన సమయాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఉన్న వంతెనలకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు ఏ మాత్రం అదమరుపుగా ఉన్నా వాహనాలు వంతెన కిందకు దూసుకుని పోయే ప్రమాదముంది. రక్షణ లేని వంతెనల కారణంగా పలువురు మృతి చెందగా మరికొందరు గాయాల పాలైన సంఘటనలు జరిగాయి.

ఏళ్లు గడుస్తున్నా.. పట్టించుకోని అధికారులు

ఆయా గ్రామాల్లోని ధ్వంసమైన అయిన వంతెనలకు ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు కరువయ్యాయని వాహనదారులు వాపోతున్నారు.

నిధులు మంజూరయ్యాయి..

మండలంలోని ధర్మాపూర్ గ్రామానికి రోడ్డు, వాగులపై నూతన వంతెనల నిర్మాణానికి రూ.2.55 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్లు ఖరారు కాగానే పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాం. యూసుఫ్‌పూర్, అల్లాపూర్, మామిడిపల్లి, ఉల్గేర, జంమ్గి గ్రామాలకు రోడ్లు, వంతెనలు నిర్మించడానికి సర్వే పూర్తయింది. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ‘హామ్’(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.

– దేవయ్య, పీఆర్ ఏఈ రాయికోడ్

లోలెవెల్ వంతెనల వల్ల ప్రతి ఏడాది వర్షాకాలంలో ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నా నూతన వంతెనల నిర్మాణాలకు మోక్షం లభించడం లేదు. ప్రమాదాలు జరుగుతున్నాయి...


ప్రమాదకరంగా యూసుఫ్‌పూర్ లోలెవెల్ వంతెన

పట్టించుకోండని ప్రయాణికులు పలు సార్లు అధికారులకు మోర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోందని వానదారులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా రోడ్ల మార్గాన ఏళ్లుగా ప్రయాణాలు సాగిస్తున్నా అవసరమైన పనులు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన పలు చోట్ల నూతన వంతెనలు, మరమ్మతు పనులు, రక్షణ గోడల నిర్మాణం పై దృష్టి సారించి ప్రయాణికుల భద్రమైన ప్రయాణానికి భరోసా కలిగించాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

విద్యార్థుల పొలంబాట


పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

జహీరాబాద్: కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులు రూరల్ హార్టికల్చర్ వర్క్ అనుభవ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం బాబానగర్‌లో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సాగు విధానం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో అనేక రకాల పంటలను పరిశీలించామని, ఇది తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌కుమార్, విద్యార్థులు భార్గవి, మాయావతి, అక్షిత, అనిత, నవ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాజుల పండుగ


చేతులకు గాజులు వేయించుకుంటున్న మహిళలు

జహీరాబాద్: కోహీర్ మండల పరిధి మదిరి గ్రామంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాజుల పండుగ నిర్వహించారు. ఆదివారం నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా మహిళలకు గాజులు తొడిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి సంప్రదాయంతో కుటుంబ అనుబంధం బలపడుతుందన్నారు. మహిళలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రేణుక, సురేఖ, అనుషమ్మ, పద్మ, పెంటమ్మ, శంకరమ్మ, మొగులమ్మ, జయమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భోగ్ భండార్


భోగ్ భండార్ నిర్వహిస్తున్న కిషన్‌సింగ్

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని బల్కంచెల్క తండా(భక్తిధామ్ తండా)లో ఆదివారం భోగ్ భండార్ నిర్వహించారు. తండాలోని విశ్వపాలిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరంలో ధర్మకర్త, ఉమ్మ డి మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూ టీ కమిషనర్ మూడ్ కిషన్ లలిత దంపతుల ఆధ్వర్యంలో భవానీ మాత దీక్షదారులు హో మం, హారతి చేపట్టారు. సంగ్రామ్ మహరాజ్ ప్రవచనం చేశారు. కిషన్ మాట్లాడుతూ భక్తిమార్గంలో నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో, బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, మల్‌గోండ, తండా ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి

మాజీ ఎంపీపీ రాంరెడ్డి

మునిపల్లి(అందోల్): ప్రజల సంక్షేమం కోసం మంత్రి దామోదర రాజనర్సింహ్మ కృషి చేస్తున్నారని మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బుదేరాలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాజకీయ పార్టీలకతీతంగా అర్హులందరికీ రైతు బంధు, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలే కాకుండా ఇతరాత్ర సంక్షేమ పథకాలను మంజూరు చేశామన్నారు. విద్యా, వైద్యం, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సింగూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దడానికి మంత్రి రాజనర్సింహ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రం ఝరాసంగం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో 2010–11 బ్యాచ్ కు చెందిన పదవ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు 15సంవత్సరాల తర్వాత ఒక్కచోట కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు సన్మానించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేరుకుళ్ల తెగులుకు ట్రైకోడెర్మా విరిడితో చెక్

కంగ్టి(నారాయణఖేడ్): ఇటీవల కురిసిన అధిక వర్షాలతో పత్తిపంటలో పలు రకాలైన తెగులు సోకి పంటలు నష్టపోవడంతో మండల వ్యవసాయాధికారి హరీష్‌పవార్ పలు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వేరుకుళ్లు తెగులు సోకి పత్తి మొక్కలు వాడిపోయి ఆకులు రాలిపోతాయి. దీనికి తోడు మెగ్నిషియం లోపంతో ఈనెలు ఆకుపచ్చ రంగులోనే ఉండి ఆకులు ఎరుపు రంగులోకి మారుతున్నాయి. మొక్కల్లో బోరాన్ లోపంతో కాయలు ఎండిపోతున్న లక్షణాలు కనిపించడంతో పత్తి పంట నష్టాల పాలవుతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న పత్తి పంటలో సస్యరక్షణ కోసం మొదలు నిల్వ నీటిని బయటకు తొలగించాలి. ట్రైకోడెర్మా విరిడి 6–8 గ్రాములు లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్ల చుట్టూ నేలపై పోయాలి. దీంతో పాటు 13–0–45 నీటిలో కరిగే ఎరువు 5–10 గ్రాములు నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. మెగ్నిషియం లోప నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు నీటరు నీటిలో, బోరాన్ లోప నివారణకు బోరాక్స్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని తెలిపారు.


నీరు నిల్వడంతో పాడవుతున్న పత్తిపంట

ఉధృతంగా మంజీరా నది


మంజీరా వరద ఉధృతికి నీట మునిగిన పంటలు


చాల్కి గ్రామ శివారులో నీట మునిగిన పత్తి పంట

- నీట మునిగిన పంటలు
- ఆందోళనలో రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో కురిసిన భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతం కర్నాటకలో కురిసిన వర్షాలకు మంజీరా నదిలోకి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతోంది. ఆదివారం ఉదయం నుంచి వరద ప్రవాహం పెరుగుతుండటంతో నది పరివాహక ప్రాంతాల పంట పొలాలు నీట మునిగాయి. నది బ్యాక్ వాటర్ వల్ల హుస్సెన్ నగర్, చీకూర్తి, అమీరాబాద్, కాకిజన్‌వాడ, ముర్తుజాపూర్, రాఘవాపూర్, చాల్కి తదితర గ్రామాల పరిధిలోని పత్తి, చెరకు, సోయా, కంది పంటలు నీట మునిగాయి. కర్నాటకలోని ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసినట్లు సమాచారం. దీంతో మంజీరా నదిలో నీటి మట్టం పెరిగి పంటలు మునుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంజీరా బ్యాక్ వాటర్‌తో ప్రతి ఏటా వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు తగవు

న్యాల్‌కల్(జహీరాబాద్): రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసనగా మండల పరిధిలోని గంగ్వార్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు ఆదివారం నిరసన చేపట్టారు. బీజేపీ నాయకుడు మల్లేష్ అధ్వర్యంలో గంగ్వార్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.

బీజేపీ నాయకుల నిరసన

నారాయణఖేడ్: ప్రధాని మోదీని ప్రపంచమంతా విశ్వగురువుగా భావిస్తే కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రతిసారి కించపరిచేలా మాట్లాడటం సరికాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ అన్నారు. ఖేడ్ మండల పార్టీ అధ్యక్షుడు దశరథ్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీహార్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ రాజ్, వివిధ మండలాల అధ్యక్షులు అనిల్ రెడ్డి, శంకర్ రావు, కృష్ణ, అశోక్, సుగుణాకర్, పట్నం మాణిక్ పాల్గొన్నారు.


న్యాల్‌కల్: రోడ్డుపై బైఠాయించిన నాయకులు

అడ్డుకున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: రాహుల్ గాంధీ వ్యాఖ్యాలను వ్యతిరేకిస్తూ బీజేపీ శ్రేణులు నిరసనతో పాటు దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ...బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ... ప్రధాని మోదీ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

జిల్లాలో ‘30’ పోలీస్ యాక్ట్ అమలు


పరితోష్ పంకజ్, ఎస్పీ, సంగారెడ్డి

సంగారెడ్డి జోన్: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని 30 రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందస్తు అనుమతి లేని లేకుండా జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకో, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. అలాగే శాంతి భద్రతలకు ప్రజాధనానికి నష్టం కల్గించే ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. అనుమతి లేకుండా చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిమజ్జనాలు షురూ


ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. న్యామతాబాద్, చాల్కి, డప్పూర్, ముంగి, అత్నూర్, రేజింతల్ తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన సుమారు 59 స్వామి విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. సాయంత్రం మండపాలల్లో స్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించిన అనంతరం వాహనాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను సమీపంలోని మంజీర నది, నారింజ వాగులో నిమజ్జనం చేశారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జహీరాబాద్ రూరల్ సీఐ జెక్కుల హన్మంత్ అధ్వర్యంలో హద్నూర్ ఎస్‌ఐ సుజిత్ బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థుల అవస్థలు


పాఠశాల సమీపంలో వర్షం నీరు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి రేజింతల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద రహదారి అధ్వానంగా మారింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల సమీపంలో గుంతల్లో వర్షపు నీరు నిల్వడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గుంతల్లో వర్షం నీరు నిల్వడం వల్ల గుంతలు కనిపించక విద్యార్థులు అందులో పడి ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని గుంతలను పూడ్చి వేయించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ గణనాథుడికి ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు: సర్వ విఘ్నాలను తొలగించి, ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని గణనాథుడిని కోరినట్లు ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో గణేష్ మండపాలను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎంపీ రఘునందన్‌రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయా కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

◆ క్రీడలను విజయవంతం చేద్దాం

జిన్నారం (పటాన్‌చెరు): 69వ ఎస్జీఎఫ్ క్రీడలు 2, 3, 4 తేదీల్లో స్థానిక గురుకుల పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు జిన్నారం ఇన్‌చార్జి ఎంఈఓ కుమారస్వామి పేర్కొన్నారు. ఈ క్రీడలను స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. 1. 1. 2009 తరువాత జన్మించిన విద్యార్థులే అర్హులు అన్నారు. అండర్– 17 విభాగంలో బాలురు బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడాంశాలు ఉంటాయన్నారు. క్రీడల నిర్వహణకు హెచ్‌ఎంలు, పీడీలు విజయవంతం చేసేలా కృషి చేయాలని కోరారు.

◆ పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి పేదలకు వరమని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నిజాంపేట మండలం టిక్యానాయక్ తండాకు చెందిన రేణుకకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.23 వేలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కును బాధిత కుటుంబీకులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతోపాటు అందులో వైద్యానికి అవకాశం లేని వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందించడం జరుగుతుందన్నారు.

◆ కంగ్టిలో 1907 ఎకరాల్లో పంట నష్టం

కంగ్టి(నారాయణఖేడ్): భారీ వర్షాలు రైతులను కుదేలు చేశాయి. వారం రోజుల వ్యవధిలో రెండు మార్లు అతివృష్టితో పంటలు నీట మునగడంతో పాటు వాగులు, వంకలు, లోతట్టు భూముల్లోని పంటలు నీట మునిగాయి. చెరువులు నిండు కుండల్లా నిండిన అనంతరం కురిసిన భారీ వర్షాలకు అలుగులు ఉధృతిగా ప్రవహించాయి. మండలంలో కురిసిన అతి వర్షాలతో పాడైన పంటల వివరాలుపై వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. మండలంలో 1907 ఎకరాల్లో పలు పంటలు పాడైనట్లు మండల వ్యవసాయాధికారి హరీష్ పవార్ తెలిపారు.

◆ ఉపాధ్యాయురాలికి సన్మానం

పుల్‌కల్(అందోల్): విధి నిర్వహణలో భాగంగా ఉద్యోగులు బదిలీపై వెళ్లడం తప్పదని డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆర్ రాంచంద్రారెడ్డి తెలిపారు. గొంగ్లూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రాజేశ్వరీ పదోన్నతిపై అందోల్ మండలానికి బదిలీ అయ్యారు. విధి నిర్వహణలో నక్కచ్చిగా వ్యవహరించి పేద విద్యార్థులకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా గొంగ్లూర్ మాజీ సర్పంచ్ లక్ష్మి ఉపాధ్యాయ దంపతులకు మెమెంటో ఇచ్చి ఘనంగా సన్మానించారు.


సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

కల్హేర్(నారాయణఖేడ్): త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయడం లేదని సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. ఆదివారం సిర్గాపూర్ మండలం కడ్పల్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. త్రీఫేజ్ సరఫరా చేయకపోవడంతో పంట పొలాలకు ఇబ్బందికరంగా మారిందని వాపోయారు. వారం రోజుల నుంచి 8 గంటలు విద్యుత్ సక్రమంగా సరఫరా కావడంలేదని ఆపరేటర్లను నిలదీశారు. గ్రామంలో మంచి నీటి సరఫరాకు ఆటంకం తలెత్తుతుందన్నారు. రైతులు సమస్యను ఫోన్‌లో విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

బాధిత రైతులను ఆదుకోండి


మాట్లాడుతున్న కేవీపీఎస్ నేత నర్సింహులు

నారాయణఖేడ్: భారీ వర్షాలకు మంజీరా నది పరివాహక పంటలు మునిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు కోరారు. ఆదివారం కేవీపీఎస్ సంఘం ఆధ్వర్యంలో పలు గ్రామాల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే భారీ వర్షాలతో పంటలు దెబ్బతినగా నది బ్యాక్ వాటర్ కారణంగా చాలా భూముల్లో పంటలు నీటమునిగాయని తెలిపారు. ప్రభుత్వం వీరందరికీ పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. సంఘం నాయకులు సతీష్, రాజు, మశ్చందర్, విష్ణు పాల్గొన్నారు.


హత్నూర(సంగారెడ్డి): నీట మునిగిన వరి పంటలు

హత్నూర మండలంలో..

హత్నూర(సంగారెడ్డి): మంజీరా నది నీటి ప్రవాహం ఉధృతి పెరగడంతో హత్నూర మండలంలోని పలు గ్రామాల్లోని వరి, పత్తి పంటలు రెండు రోజులుగా మునిగిపోయినట్లు రైతులు తెలిపారు. మండలంలో మంజీరా పరివాహక ప్రాంతంలోని ఆయా గ్రామాల శివారుల్లోని మంజీరా నది ఉప్పొంగి పొంగడంతో పత్తి, వరి పంటలు మునిగి పంటలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంటలను ప్రభుత్వం ఆదుకోవాలని పలు గ్రామాల రైతులు అధికారులను కోరారు.

విద్యా వలంటీర్లను నియమించాలి

ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్



హత్నూర(సంగారెడ్డి): ప్రమోషన్ ద్వారా ప్రాథమిక పాఠశాలల్లోని ఖాళీలను ప్రభుత్వం వెంటనే విద్యా వాలంటీర్లను నియమించాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ ప్రమోషన్లలో సంగారెడ్డి జిల్లాలో సుమారు 190 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎస్సీపీఎస్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్ పొందారు. దీంతో జిల్లాలో 190 ఉపాధ్యాయుల ఖాళీలు ఏర్పడ్డాయని తెలిపారు. గత నెలలో ఉపాధ్యాయుల కొరత వల్ల మెజారిటీ ప్రాథమిక పాఠశాలలో 50 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు, 90లోపు ఉన్న ముగ్గురే ఎస్జీటీ ఉపాధ్యాయులు పనిచేశారని పేర్కొన్నారు. ఇచ్చిన సర్దుబాటు ఉత్తర్వులను వెనక్కి తీసుకొని ప్రమోషన్ ద్వారా ప్రాథమిక పాఠశాలలో ఏర్పడ్డ ఖాళీలను వెంటనే విద్యా వాలంటీర్ల ద్వారా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సదాశివపేటలో క్రీడార్యాలీ

సదాశివపేట(సంగారెడ్డి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు ర్యాలీ నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు మన్సూర్, కుంగ్ఫూ కరాటే శిక్షకుడు గ్రాండ్ మాస్టర్ సాజీద్‌ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సిద్ధాపూర్ గౌనీ నుంచి హౌజింగ్ బోర్డులోని ఈద్గా మైదానం వరకు సాగింది. ఈ క్రీడార్యాలీలో బండారి పాండు, సెయింట్ అంథోనిస్ ఉన్నత పాఠశాల, మోనోప్లే, సెయింట్ మేరీస్, శ్రీవికాస్, లిటిల్ బర్డ్స్, అక్స్‌ఫర్డ్, మైనార్టీ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, భవిత కళాశాల ప్రిన్సిపాల్, బాలరాజ్, సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, వ్యాయమ ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, రాఘవ్త, అల్తాఫ్, కృష్ణ, సంగమేశ్వర్, మహేశ్, శ్రీధర్, అనిల్, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు, విద్యార్థులు

బీజేపీతోనే సంక్షేమం సాధ్యం


మాన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని ఆయన నివాసంలో కార్యకర్తలతో కలసి మాన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాజు, అనీశ్‌రెడ్డి, మల్లేశ్, కృష్ణమూర్తి, రాజేశ్వరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

గౌండ్ల రజనీకాంత్ తండ్రి రాములు గౌండ్ల, ఇ.నం. 9–57/3, మాణిక్య నగర్, ముత్తంగి, సంగారెడ్డి, పిన్ : 502300 వాసినైన నేను నా యొక్క పాస్‌పోర్ట్ నం. Y7378075 ను ఎయిర్‌పోర్ట్ నుండి ముత్తంగిలోని నా ఇంటికి వెళ్తుండగా పోగొట్టుకున్నాను. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికినచో సంప్రదించగలరు. సెల్ : 9949643546

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE, SANGAREDDY, TELANGANA
I.A. No.789 of 2025
IN
GWOP No. 12 of 2023

BETWEEN:
Smt. Archana Singh, W/o Late Sri Adarsh Karan Singh, aged about 50 years, Homemaker, R/o H.No.44, HIG, Phase-I, Madhava Nagar, Ramachandrapuram, Sangareddy District, Telangana, (Also representing her minor sons, Master Raunak Singh and Master Kundan Singh, as their natural guardian) ... Petitioners
AND
Sri T. Ramesh Singh ...Respondents/Vendees

PUBLIC NOTICE

Take notice that the above-named Petitioners are about to execute a Registered Sale Deed in respect of the following property, which is proposed to be executed within 7 days from today. **Schedule of Property:** Residential House No. 28-44, constructed on Plot No. 44 in Survey No. 232 (Part), admeasuring 300 Sq. yards, with a plinth area of 2980 sq. ft. (Ground Floor 1490 sq. ft. and First Floor 1490 sq. ft.), situated at HIG Colony, Madhava Nagar, Ramachandrapuram, Sangareddy District, Telangana, bounded by: **North:** Plot No.35, **South:** 12 M wide Road, **East:** Plot No.43, **West:** Plot No.45.Any person having any claim, right, title, or objection over the above property is hereby directed to file their claim/objection before this Hon'ble Court within 7 days from the date of this notice, failing which the matter will be decided as ex parte and it shall be deemed that no one has any objection.

// BY ORDER OF THE COURT //
M/s. R.S.ASSOCIATES LAW OFFICE
RATAN SINGH Advocates
Off.: H.No.24-42/2,ASHOK NAGAR, BHEL 9866470216